సాక్షి విశాఖపట్నం

బుధవారం । 22 । జనవరి । 2025



వైజాగ్ @ 14.4°

సాక్షి, విశాఖపట్నం : నగరవాసులను చలి గజగజ వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోతున్నాయి. మంగళవారం విశాఖ ఎయిర్‌పోర్టు పరిధిలో ఈ సీజన్‌లో 14.4 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. 1970 నవంబర్ 30న 12.9 డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. జనవరి నెలలో చూస్తే 1962 జనవరి 6న అత్యల్పంగా రికార్డు స్థాయిలో 10.5 డిగ్రీలు ఇప్పటికీ రికార్డుగా ఉంది. గత మూడేళ్ల కాలంలో మంగళవారం నమోదైన 14.4 డిగ్రీలే కనిష్ట ఉష్ణోగ్రత అని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

● సాహసం శ్వాసగా సాగిపో...





విద్యతో పాటు దేశభక్తిని వారిలో పెంపొందిస్తున్నారు. నిత్యం తరగతుల్లో అధ్యాపకులు చెప్పే జీవనపాఠాలను వింటారు. సాయంత్రం నుంచి మైదానంలో తుపాకులు పట్టుకుని కవాతులు చేస్తున్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాల ఎన్‌సీసీ విభాగానికి చెందిన విద్యార్థులు గణతంత్ర దినోత్సవానికి సిద్ధమవుతున్నారు. తుపాకులు పట్టుకుని కవాతులో చెమటోడుస్తూ సాధనలో పాల్గొంటున్నారు. దేశం కోసం, ప్రజల భద్రత కోసం తాము సైతం అనే విధంగా భవిష్యత్తులో దేశ రక్షణ రంగంలో సేవలు అందించడానికి సన్నద్ధమవుతున్నట్లుగా వీరి సాధన సాగుతోంది.

- ఏయూక్యాంపస్/ ఫొటోలు : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

మందుల్లేవ్.. మహాప్రభో..!



మందులు ఇచ్చే గదిలో సిబ్బంది

- కేజీహెచ్‌తోపాటు ప్రధాన ఆస్పత్రుల్లో మందుల కొరత
- గ్లౌజులు, ఇంజక్షన్లు కూడా లేని దుస్థితి
- అత్యవసర మందుల కోసం రోగుల పాట్లు
- గత ప్రభుత్వ హయాంలో నెలరోజులకు సరిపడా మందులు



కిటకిటలాడుతున్న కేజీహెచ్ మందులు ఇచ్చే గది

మహారాణిపేట : ప్రభుత్వ, బోధన ఆస్పత్రుల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. పేదలకు పెద్ద దిక్కుగా ఉన్న కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్య శాల, ఈఎస్‌టీ ప్రభుత్వ ఆస్పత్రి, రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి, టీబీ, ఐడీ ఆస్పత్రుల్లో మందుల కొరత పట్టిపీడిస్తోంది. వైద్యులు రాసిచ్చిన చీటి పట్టుకొని మందుల కోసం తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో నెలరోజులకు మందులు ఇవ్వగా ఇప్పుడు వారం రోజులకు.. అదీ అరకొరగా ఇస్తున్నారు. ఇదేమటని అడిగితే స్టాక్ లేదని సిబ్బంది, విజయవాడ నుంచే రావడం లేదు.. ఇండెంట్ పెట్టామని చెబుతూ ఉన్నతాధికారులు తప్పించుకుంటున్నారు. దీంతో పేద రోగులు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ఆస్పతుల్లో గ్లౌజులు, ఇంజక్షన్ల కొరత కూడా విపరీతంగా ఉంది. కేజీహెచ్‌లో రోజుకు వందకు గ్లౌజెస్ సెట్లు అవసరం కాగా పది సెట్లకు మించి ఉండడం లేదు. ఒక్కోసారి గ్లౌజులు లేకుండా ఆపరేషన్లు చేయాల్సి వస్తోందని వైద్యులు చెబుతున్నారు.

రోగుల కిటకిట

సీజన్ మార్పుతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. రోగులతో కేజీహెచ్ కిటకిటలాడుతోంది. కేజీహెచ్‌కు ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళం, ఒడిశా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. వైద్యం అనంతరం నెల రోజులకు సరిపడా మందులు రోగులకు ఇచ్చి పంపేవారు. గత ప్రభుత్వ హయాంలో ఈ విధానం కచ్చితంగా అమలయ్యేది. కూటమి ప్రభుత్వం వచ్చాక మందుల కొరత ఏర్పడింది. సోమవారం నుంచి శనివారం వరకు ఇటు ఓపీలు, అటు మందుల కౌంటర్లు రద్దీగా ఉంటాయి. మందుల కోసం వచ్చే రోగులకు తీవ్ర నిరాశ ఎదురవుతోంది.

అన్ని మందులు ఇవ్వడం లేదు

గతంలో నెల రోజులకు సరిపడే మందులు ఇచ్చేవారు. ఇప్పుడు మందుల కొరత ఉండడంతో వారం రోజులకు మించి ఇవ్వడం లేదు. ఇందులో కూడా కొన్ని రకాల మందులు మాత్రమే ఇస్తున్నారు. మిగిలినవి ప్రైవేట్ మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఆస్పత్రిలో మొత్తం 1,500 రకాల మందులు గతంలో ఉండేవి.. ఇప్పుడు కేవలం 300 రకాలు కూడా లేవని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఈ పరిస్థితి ఒక్క కేజీహెచ్‌లోనే కాకుండా ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ప్రభుత్వ మానసిక వైద్యశాల, ఈఎస్‌టీ ఆస్పత్రి, రాణి చంద్రమణి దేవి ఆస్పత్రి, టీబీ ఆస్పత్రుల్లోనూ ఉంది. క్షతగాత్రులకు డ్రెస్సింగ్ చేయడానికి అవసరమైన మందులు, సూదులు, కిట్స్ కూడా అందుబాటులో లేవు. ఎవరికైనా డ్రెస్సింగ్ కావాలంటే వారు బయట కిట్ కొనుగోలు చేసి తెచ్చుకుంటున్నారు.

గతంలో ఆరోగ్యానికి పెద్దపీట

గత ప్రభుత్వ హయాంలో వైద్యం, ఆరోగ్యానికి పెద్దపీట వేశారు. రోగులకు అన్ని రకాల వైద్య సేవలు చేరువ చేశారు. వైద్యం పూర్తిగా అందించి కోలుకున్నాక.. మందులన్నీ ఇచ్చి మరీ పంపేవాళ్లు. పేదల ఆరోగ్యానికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసాగా నిలిచింది. ఆ తరువాత వచ్చిన కూటమి ప్రభుత్వం రోగులకు చుక్కలు చూపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు కూడా ఇవ్వలేని పరిస్థితులున్నాయి. మంచి రోజులు పోయి.. మందులు లేని రోజులు వచ్చాయంటూ రోగులు ఉసూరుమంటున్నారు.

మందులు నిల్ - కౌంటర్లు కిటకిట

కేజీహెచ్‌తోపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఇచ్చే కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. కాని అక్కడ మందుల సంఖ్య చాలా తక్కువగా ఉండడంతో రోగులు నిరాశ చెందుతున్నారు. వైద్యులు రాసిన అన్ని మందులు దొరకడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు మెడికల్ షాపుల్లో మందులు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పేదలకు ఆర్థిక భారం పడుతోంది.

త్వరలో డ్రోన్ పెట్రోలింగ్

- పోలీసులు వెళ్లలేని ప్రాంతాల్లోకి డ్రోన్లతో నిఘా
- డిసెంబర్‌లో 67 చోరీ కేసుల ఛేదన.. 91 మంది నిందితుల అరెస్ట్
- వారి నుంచి రూ.90.53 లక్షల చోరీ సొత్తు స్వాధీనం
- రికవరీ మేళాలో పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ



రికవరీ సొత్తును బాధితుడికి అందిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: నేరాల నియంత్రణకు త్వరలోనే డ్రోన్ పెట్రోలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ తెలిపారు. పోలీసులు వెళ్లలేని ప్రాంతాల్లోకి డ్రోన్లతో నిఘా పెట్టి నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో రికవరీ మేళా నిర్వహించారు. డిసెంబర్‌లో 67 చోరీ కేసులను ఛేదించి 91 మంది నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. వీరి నుంచి 1.01 కేజీల బంగారం, 2.47 కేజీల వెండి, రూ.12.07 లక్షలు, 10 బైక్‌లు, ఒక ఆటో, 100 మీటర్ల కాపర్ కేబుల్, 315 సెల్‌ఫోన్లు మొత్తంగా రూ.90,53,226 విలువ చేసే సొత్తును రికవరీ చేసినట్లు వెల్లడించారు. చోరీ కేసుల ఛేదనలో క్రైమ్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రతీ నెలా రికవరీ రేటు పెరుగుతోందని వివరించారు. సెప్టెంబర్‌లో రూ.86 లక్షలు, అక్టోబర్‌లో రూ.88 లక్షలు, నవంబర్ రూ.89 లక్షలు, డిసెంబర్ రూ.90 లక్షలకు పైగా చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంక్రాంతి సమయంలో పోలీసులు నిరంతర నిఘా, ప్రత్యేక పెట్రోలింగ్ కారణంగా నగరంలో హౌస్ బ్రేకింగ్‌లు తగ్గుముఖం పట్టాయన్నారు. 2021లో 12, 2022లో 8, 2023లో 9, 2024లో 12, ఈ ఏడాది సంక్రాంతి సమయంలో కేవలం 3 హౌస్ బ్రేకింగ్‌లు మాత్రమే జరిగాయన్నారు. ఇందులో ఒక కేసును ఛేదించగా..మరో కేసులో ఆధారాలు ఉన్నాయని త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని పేర్కొన్నారు.

మార్చి 31లోగా అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు

నగరంలో నేరాల నియంత్రణ, నిందితుల పట్టివేతకు సీసీ కెమెరాల ఏర్పాటుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. స్టేషన్ల వారీగా నేరాలు, శాంతి భద్రతలకు విఘాతం కలిగే హాట్ స్పాట్లను గుర్తించి అక్కడ మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు 7 వేల సీసీ కెమెరాలు అందుబాటులో ఉండగా, ఈ ఏడాది మార్చి 31వ తేదీ నాటికి అన్ని ప్రాంతాల్లో కెమెరాల ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీపీ (క్రైమ్) లతా మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నవ జీవన నిర్మాణం పేరుతో అవగాహన

సైబర్ నేరాలు ప్రపంచానికి ముప్పుగా మారాయని పేర్కొన్నారు. దీంతో నవ జీవన నిర్మాణం పేరుతో సైబర్ నేరాలు, డ్రగ్స్, మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. త్వరలోనే అన్ని స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీలకు వెళ్లి ఆయా అంశంపై యువతకు అవగాహన కల్పిస్తామని తద్వారా కొంత మేర నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎవరినీ ఉపేక్షించేది లేదు

- క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో పెద్ద చేపలపైనే గురి
- రాజకీయ నేతలైనా, పోలీసులైనా.. వదిలేది లేదు
- 80 బ్యాంక్ ఖాతాల ద్వారా రూ.178 కోట్లు లావాదేవీలు
- పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: 'క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో ఎవరినీ ఉపేక్షించేది లేదు. చిన్న వారిని కాదు.. పెద్ద చేపలపైనే గురి పెట్టాం. ఈ కేసులో రాజకీయ నేతలు, పోలీసులు.. ఇలా ఎవరి ప్రమేయం ఉన్నా వదిలే ప్రసక్తే లేద'ని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ స్పష్టం చేశారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ కారణంగా రూ.లక్షలు పోగొట్టుకొని అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, కొంత మంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ కేసును చాలా సీరియస్‌గా తీసుకున్నామని, సైబర్ క్రైమ్ ద్వారా లోతుగా దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. సాంకేతికత, కొత్త సాఫ్ట్‌వేర్ల సాయంతో విచారణను వేగవంతం చేశామని వివరించారు.

ఇప్పటి వరకు 8 మందిని అరెస్టు చేయగా.. వారి నుంచి సేకరించిన సమాచారంతో అనేక బ్యాంక్ ఖాతాలను నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. ఇందుకు కొంత సమయం పడుతుందని, అయినప్పటికీ ఈ కేసులో ప్రధాన సూత్రధారులు, బుకీలను విడిచిపెట్టేది లేదని తేల్చి చెప్పారు. కేసు వివరాలను వెల్లడిస్తే అసలు నిందితులు తప్పించుకునే ప్రమాదం ఉందని, అందుకే కేసును రహస్యంగా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

మరో ఇద్దరు అరెస్ట్

క్రికెట్ బెట్టింగ్ కేసులో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఇప్పటి వరకు 8 మందిని పట్టుకున్న పోలీసులు మంగళవారం మరో ఇద్దరు బుకీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి ద్వారా మరికొంత మంది బెట్టింగ్ నిర్వహిస్తున్న బుకీల సమాచారాన్ని సేకరించారు. వారి కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఇప్పటి వరకు నిందితుల సమాచారంతో కొన్ని బ్యాంకు ఖాతాలను పరిశీలించగా.. రూ.178 కోట్లు మేరకు బెట్టింగ్ లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. ఇంకా అనేక బ్యాంక్ ఖాతాలను పరిశీలించాల్సి ఉంది. ఇందులో అధికంగా మ్యూల్ అకౌంట్లు ఉన్నాయి. ముమ్మందు మరిన్ని అరెస్టు ఉంటాయని పోలీసులు చెబుతున్నారు.

ఆర్టీసీ సంక్రాంతి ఆదాయం రూ.2 కోట్లు

దాబాగార్డెన్స్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని ద్వారకా బస్‌స్టేషన్ నుంచి సాధారణ బస్సులతో పాటు, ప్రత్యేక సర్వీసులు నడిపిన నేపథ్యంలో ఆర్టీసీకి రూ.2 కోట్ల మేర ఆదాయం వచ్చినట్టు ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు తెలిపారు. గతేడాదితో పోలిస్తే 35 శాతం అదనంగా వచ్చిందన్నారు. సంక్రాంతికి ముందు, తర్వాత ఈ నెల 21 వరకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, కాకినాడ, పార్వతీపురం, సాలూరు తదితర ప్రాంతాలకు 2 వేల బస్సులు వరకు నడిపినట్టు చెప్పారు. ప్రయాణికుల నుంచి ఎటువంటి అదనపు చార్జీ వసూలు చేయలేదన్నారు.

కలెక్టర్‌కు జీవీఎంసీ పూర్తి అదనపు బాధ్యతలు

ఏయూక్యాంపస్ : జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్‌కు జీవీఎంసీ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ప్రస్తుతం జీవీఎంసీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ పి.సంపత్ కుమార్ బదిలీ అయిన విషయం తెలిసిందే.

గీత కులాలకు 29 మద్యం దుకాణాలు

ఏయూక్యాంపస్ : రాష్ట్ర ప్రభుత్వం గీత కులాలకు ఉమ్మడి విశాఖలో జిల్లాలో మొత్తం 29 దుకాణాలను కేటాయించింది. అనకాపల్లి జిల్లాలో గౌడ్ (1), గౌడ (1), శెట్టి బలిజ (9), యాత (4) దుకాణాల చొప్పున మొత్తం 15 , విశాఖ జిల్లాలో గౌడ్ (1), గౌడ (1), శెట్టి బలిజ (11), యాత (1) మొత్తం 14 దుకాణాలను కేటాయిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొంది. అల్లూరి సీతారామరాజుకు ఒక్క దుకాణం కూడా కేటాయించలేదు.

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నాహాలు

- ఉత్తరాంధ్రలో తుది ఓటర్లు 19 వేల మంది
- పోలింగ్ కేంద్రాలు, సిబ్బందిపై కసరత్తు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీ కాలం ఈ ఏడాది మార్చి 29తో ముగియనుంది. ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తికావడంతో పోలింగ్ స్టేషన్లు, సిబ్బంది, ఇతర ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు 123 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతి మండల కేంద్రంలో ఒక పోలింగ్ స్టేషన్ ఉండేలా ప్రతిపాదించి, ఎన్నికల కమిషన్‌కు పంపారు. నామినేషన్ల స్వీకరణ విశాఖ కలెక్టర్ కార్యాలయంలోనే జరగనుంది. వచ్చే నెల 15 తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ జారీకానుంది. మార్చి మొదటి వారంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది.

ఓటర్ల జాబితా ప్రకటన

ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల తుది జాబితాను గత నెల 30న అధికారికంగా ప్రకటించారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 19,523 మంది ఓటర్లుండగా ఈసారి స్వల్పంగా పెరిగి, 21,555 మందికి చేరింది. ఇందులో 12,948 మంది పురుషులు, 8,607 మంది స్త్రీలు ఉన్నారు. శ్రీకాకుళంలో 4,829 మంది, విజయనగరంలో 4,937 మంది, మన్యం పార్వతీపురం 2,262లో మంది, అల్లూరి సీతారామరాజు జిల్లా లో 1,448 మంది, విశాఖలో 5,277 మంది, అనకాపల్లిలో 2,802 మంది ఓటర్లు ఉన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా పరశురామరాజు



పరశురామరాజును సత్కరిస్తున్న పార్టీ నాయకులు

ఎంవీపీకాలనీ: బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా నూతన అధ్యక్షుడిగా మంతెన నాగ పరశురామరాజు నియమితులయ్యారు. మంగళవారం లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అధికారికంగా ప్రకటించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన అందరికీ కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తూ స్టీల్ ప్లాంట్‌పై విశాఖ ప్రజలకు ఎలాంటి సందేహం అవసరం లేదన్న ఆయన ప్లాంట్ ప్రైవేటీకరణకు తాము ఎట్టిపరిస్థితుల్లోను ఒప్పుకునేదీ లేదన్నారు. కూటమిలో భాగమైన తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తానంటే ఆనందమేనన్నారు. బెట్టింగుల్లో రాజకీయ, అధికార వర్గాలకు చెందిన వ్యక్తులు ఉంటే ఉపేక్షించవద్దని పోలీసుశాఖకు సూచించారు. అనంతరం పరశురామరాజును పార్టీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కాశీవిశ్వనాథరావు, విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

అదే మర్రి నా స్పెషల్





నా విత్తనాలు చాలా చిన్నవే ఎదిగానంటే మాత్రం మహావృక్షంగా మారిపోతా. ఎంతంటే నా నీడలో వందలమంది ఒకేసారి విశ్రాంతి తీసుకునేంత. నా వేర్లు భూమిపైకీ కనిపిస్తుంటాయి. కొమ్మలు ఊడలుగా మారి కిందికి దిగి నేలలోకి చొచ్చుకుపోతాయి. లావుగా ఉండే మాను, చిన్న చిన్న ఎర్రని పండ్లు, పెద్ద ఊడలతో గమ్మత్తుగా ఉంటా. ఒకసారి ప్రభుత్వ అతిథి గృహం (సర్క్యూట్ హౌస్) వైపు రండి..నేనెంత విస్తరించి నీడనిస్తున్నానో తెలుస్తుంది.

- ఏయూక్యాంపస్/ ఫొటోలు : సాక్షి ఫొటో గ్రాఫర్, విశాఖపట్నం

బాలికపై లైంగిక దాడి

- యువకుడి అరెస్టు
- పోక్సో కేసు నమోదు

మధురవాడ : పీఎం పాలెం పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. హెచ్‌పీసీఎల్ లేఅవుట్‌లో 15 ఏళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారం చేసినట్లు ఆమె తల్లి పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నల్ల సాయితేజ(30)ను అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు. అతడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బక్కన్నపాలేనికి చెందిన సాయితేజ స్థానికంగా ఓ వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు.

24న సుకన్య సమృద్ధి ఖాతాల మేళా

మహారాణిపేట: జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా సుకన్య సమృద్ధి ఖాతాలు తెరవడానికి ఈనెల 24న మేళా నిర్వహిస్తున్నట్టు తపాల శాఖ సీనియర్ పోస్టల్ సూపరింటెండెంట్ గజేంద్ర కుమార్ మీనా తెలిపారు. ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు ఈ ఖాతాలను తెరిచి ప్రయోజనం పొందాలన్నారు. ఈ పథకం కింద ఆడపిల్లల తల్లిదండ్రులు పదేళ్లలోపు వయస్సు గల కుమార్తెల పేరిట ఖాతా తెరవచ్చునని, ఏడాదికి రూ.250 మొదలు కొని రూ.1.50 లక్షల వరకు జమ చేయవచ్చునన్నారు. ఈ ఖాతాలో జమ చేసిన నగదుకు ఎక్కువ వడ్డీని పొందవచ్చునని మీనా తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉందాం



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఎన్నో అనర్థాలకు దారితీసే ప్లాస్టిక్ వినియోగానికి అందరూ దూరంగా ఉండాలని, విశాఖను ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్లాస్టిక్ నిషేధం, ఇతర కార్యాచరణపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, డీసీపీ అజిత, వివిధ విభాగాల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టేందుకు పాటించాల్సిన పద్ధతులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రైల్వే స్టేషన్, బస్టాండు, పెద్దపెద్ద షాపింగ్ కాంప్లెక్సులు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రులు, మద్యం దుకాణాలు, పర్యాటక ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధించాలన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ సీఎంవో సురేష్, జోనల్ కమిషనర్, నేవీ, పోలీసు, పరిశ్రమలు, విద్యాశాఖ, ఇతర వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

సంస్కరణలతో పేద విద్యార్థులకు తీవ్ర నష్టం

విశాఖ విద్య: ప్రభుత్వం తీసుకొస్తున్న విద్యా సంస్కరణలు నిరుపేద విద్యార్థులకు తీవ్ర నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ (ఏఐఎస్ఈసీ) అభిప్రాయపడింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో 'ఇంటర్ సిలబస్-పరీక్షలు, భాషల బోధనలో ప్రతిపాదిత మార్పులు-పర్యవసానాలు' అనే అంశంపై మంగళవారం వెబినార్ నిర్వహించారు. ఆల్ ఇండియా సేవ్ ఎడ్యుకేషన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి ఎం.సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.వేణుగోపాల్ రెడ్డి, ఎస్కే యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, ప్రముఖ మానవ హక్కుల నాయకుడు ఏ. చంద్రశేఖర్, డాక్టర్ సుబ్రహ్మణ్యం రెడ్డి వివిధ అంశాలపై ప్రసంగించారు. విశాఖ నుంచి డాక్టర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, జాతీయ కార్యదర్శి ఎస్ గోవిందరాజులు పాల్గొన్నారు. విద్యారంగంలో సంస్కరణలు తెచ్చేముందు స్టేక్ హోల్డర్లను సంప్రదించిన తరువాతనే ప్రభుత్వం ముందుకెళ్లాలని ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రికి విన్నవించేలా కమిటీ నిర్ణయించినట్లు అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్ చంద్రశేఖర్ తెలిపారు.

'పది'లో శతశాతం ఉత్తీర్ణత లక్ష్యం

మహారాణిపేట: ఈ ఏడాది పదో తరగతి ఫలితాలు శతశాతం సాధించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆకాంక్షించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరీక్షల విభాగం సహకారంతో రూపొందించిన స్టడీ మెటీరియల్ ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ విద్యార్థుల చేత స్టడీ మెటీరియల్‌ను ప్రాక్టీస్ చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, సమగ్ర శిక్ష అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జపనీస్ డిప్లొమా కోర్సులో ప్రవేశాలు

విశాఖ విద్య : జపనీస్ భాష డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విదేశీ భాషల విభాగాధిపతి ఆచార్య చల్లా రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆంధ్ర విశ్వవిద్యాలయం అడ్మిషన్ల డైరెక్టర్ లేదా ఆంధ్ర విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ రెండో అంతస్తులోని విదేశీ భాషల విభాగాన్ని, వివరాలకు 9014088901లో సంప్రదించాలని సూచించారు.

వయో వృద్ధుల సమస్యలపై రాజ్యసభలో చర్చిస్తా



మాట్లాడుతున్న ఎంపీ గొల్ల బాబూరావు

దాబాగార్డెన్స్: దేశంలో వయో వృద్ధులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యసభలో చర్చిస్తానని, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు హామీ ఇచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం జిల్లా సీనియర్ సిటిజన్స్ సంఘం వార్షికోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గొల్ల బాబూరావు మాట్లాడుతూ తాను కూడా వయో వృద్ధుడినేనని, ఈ సంఘానికి రూ.10 వేలు చెల్లించి చీఫ్ పేట్రన్ సభ్యత్వం తీసుకున్నారు. నగరంలో వయో వృద్ధులకు సామాజిక భవనం లేదని సంఘం చేసిన విజ్ఞప్తికి బాబూరావు స్పందించారు. సామాజిక భవనం నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానన్నారు. నాగార్జున విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కొత్తూరు మంగపతి, సెక్రటరీ జనరల్ డాక్టర్ పీకే జోష్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం : రైళ్ల రద్దీ, ప్రయాణికుల సౌకర్యార్థం కొన్ని రైళ్లకు శాశ్వతంగా, మరికొన్నింటికి తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. జసిద్ధి-తాంబరం(12376) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22వ తేదీ నుంచి, తాంబరం-జసిద్ధి(12375) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 25వ తేదీ నుంచి శాశ్వత ప్రాతిపదికన ఒక జనరల్ సెకండ్‌క్లాస్ కోచ్‌ను జతచేస్తున్నారు. హతియా-ఎస్ఎంవీ బెంగళూరు(12835) ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 25వ తేదీ నుంచి, ఎస్ఎంవీ బెంగళూరు-హతియా (12836) ఎక్స్‌ప్రెస్‌కు మార్చి 27వ తేదీ నుంచి 2-జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లను శాశ్వత ప్రాతిపదికన జతచేస్తున్నారు. విల్లుపురం-ఖరగ్‌పూర్(22604) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 21 నుంచి ఫిబ్రవరి 18వ తేదీ వరకు, ఖరగ్‌పూర్-విల్లుపురం(22603)ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 20వ తేదీ వరకు 1-స్లీపర్‌క్లాస్ కోచ్‌ను తాత్కాలికంగా జతచేస్తున్నారు. తిరునల్వేలి-పురులియా(22606) ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 22 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు, పురూలియా-తిరునల్వేలి(22605)ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 24 నుంచి ఫిబ్రవరి 21వ తేదీ వరకు 1-స్లీపర్ క్లాస్ కోచ్ తాత్కాలికంగా జతచేస్తున్నారు.

నాణేల జూదంలో ఎమ్మెల్యే గణబాబు అనుచరుడి అరెస్ట్



పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ గవ్వ భాస్కర్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ (ఫైల్)

పెందుర్తి: నాణేలతో జూదమాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అనుచరుడ్ని నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. జీవీఎంసీ 89వ వార్డు టీడీపీ కార్యదర్శి గవ్వ భాస్కర్ సహా ఆరుగుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.62,200 స్వాధీనం చేసుకుని పెందుర్తి పోలీసులకు అప్పగించారు. యల్లపువానిపాలెనికి చెందిన 89వ వార్డు టీడీపీ కార్యదర్శి గవ్వ భాస్కర్ (జీవీఎంసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి), కొత్తపాలెనికి చెందిన షేక్ మదీనా, చంద్రనగర్‌కు చెందిన బర్రి శ్రీను, చంద్రనగర్‌కు చెందిన తుపాల నూకరాజు, బాజీ జంక్షన్‌కు చెందిన గండి దారబాబు, లక్ష్మీనగర్‌కు చెందిన దుక్క కిరణ్‌లు కలిసి కొత్తపాలెం-నరవ ప్రాంతంలో మూడు నాణేలు ఎగరేసి పందేలు కాస్తున్నారు. దీనిపై మెరుపుదాడి చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారందరినీ అరెస్టు చేసి పెందుర్తి పోలీసులకు అప్పగించారు. సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారదర్శకంగా మద్యం అమ్మకాలు

పెందుర్తి : రాష్ట్రంలో మద్యాన్ని పారదర్శకంగా అమ్ముతున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఎక్కడా కల్తీ మద్యం అమ్మకాలకు తావు లేకుండా ప్రతి బాటిల్ మీద స్కాన్ చేస్తే దాని పుట్టు పూర్వోత్తరాలు వచ్చే విధంగా సాంకేతిక పరిజ్ఞానం రూపొందించామన్నారు. మంగళవారం పెందుర్తి మండలం జెర్రిపోతులపాలెంలోని రాష్ట్ర బెవరజేస్ కంపెనీని మంత్రి సందర్శించారు. డిపోలో మద్యం బాటిళ్లను తనిఖీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పారదర్శకంగా మద్యం అమ్మడం ద్వారా ప్రజలకు ఆరోగ్యంతో పాటు ప్రభుత్వానికి మంచి ఆదాయాన్ని కూడా సమకూర్చుతున్నామని చెప్పారు. ఈ నెల 29 నుంచి నవోదయం కార్యక్రమం ద్వారా సారా, ఇతర అక్రమ మద్యాన్ని రాష్ట్రం నుంచి పూర్తిగా పారదోలుతామన్నారు. యువత కోసం అన్ని రకాల బీర్లు అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, సెబ్, ఎక్సైజ్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎన్ఎస్ కిర్చ్ వార్షికోత్సవం



ఐఎన్ఎస్ కిర్చ్

సింధియా: ఈస్టర్న్ ఫ్లీట్ ఆఫ్ ఇండియన్ నేవీకి చెందిన బలీయమైన క్షిపణి కార్వెట్ ఐఎన్ఎస్ కిర్చ్ 24వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించినట్టు నేవీ వర్గాలు తెలిపాయి. ఈ యుద్ధ నౌక ప్రాజెక్ట్ -25ఏ మిస్సైల్ కొర్వెట్టెస్ రెండో నౌకగా జనవరి 22వ తేదీ 2001వ సంవత్సరం నుంచి తన సేవలందిస్తోంది. 1,500 టన్నుల బరువు ఉన్న ఈ యుద్ధనౌక 25 నాటికల వేగాన్ని అధిగమిస్తూ ప్రయాణించడం దీని ప్రత్యేకత.